ప్రమాదకరంగా మలుపులు

- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని వైనం
- సూచిక బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి

బురాన్‌పూర్ రోడ్డు మలుపులో వాహనాలు కనిపించకుండా పెరిగిన చెట్లు

బొంరాస్‌పేట, జూన్ 30 : మండలంలోని పలు గ్రామాల రహదారుల మలుపులు ప్రమాదకరంగా మారాయి. మలుపుల వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సూచిక బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. రోడ్డు మలుపు ఉందని తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బొంరాస్‌పేట నుంచి బురాన్‌పూర్ వెళ్లే రోడ్డులో, బొంరాస్‌పేట నుంచి ముద్దాయిపేట వెళ్లే రోడ్డులో నమాజ్‌గుట్ట వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద రోడ్డుకు పక్కన చెట్లు, పొదలు గుబురుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడడం లేదు. ముఖ్యంగా రాత్రి సమయంలో మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. రోడ్డు మలుపులు, కూడళ్లలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు సూచిక బోర్డులు, రాత్రి సమయాలలో వాహనదారులకు కనబడే విధంగా రేడియంతో సైన్ బోర్డులు ఏర్పాటు చేసేవారు. ఇవి లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్డు మలుపుల వద్ద రోడ్డుకు పక్కన పెరిగిన చెట్లను తొలగించడంతో పాటు సూచిక బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముద్దాయిపేట రోడ్డులో నమాజ్‌గుట్ట వద్ద ప్రమాదకర మలుపు

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

ధారూరు, జూన్ 30: ధారూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతు భరోసా పై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేయనున్నట్లు ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి మండల పరిధిలోని ప్రతి గ్రామంలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై తమ తమ అభిప్రాయాలను తెలియజేయలన్నారు. ఈ సమావేశాన్ని జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దోమ: రైతుల పంట పెట్టుబడి కోసం తెంలగాణ ప్రభుత్వం తీసుకువస్తున్న రైతు భరోసా పథకం అమలు విధి విధానాలపై సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు దోమ రైతు వేదికలో రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సమీక్షా సమావేశానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి రైతులు అత్యధిక సంఖ్యలో హాజరై రైతు భరోసా పథకంపై తమ అభిప్రాయాలను తెలియజేయాలని చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి కోరారు.

బషీర్ సేవలు అభినందనీయం..

ధారూరు, జూన్ 30: ధారూరు విద్యుత్‌శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన బషీర్ సేవలు అభినందనీయమని ధారూరు విద్యుత్‌శాఖ ఏఈ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఘనంగా వీడ్కోల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుభాన్, మల్లేష్, హరి నాథ్, అత్తర్ అలీ, విజయ్. చెన్నయ్య, రామ్‌రెడ్డి, చరణ్ సింగ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ..

పరిగి, జూన్ 30: ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆదివారం వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే యాదయ్యను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సన్మానించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం..

వికారాబాద్, జూన్ 30 : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని 2006-2009 శ్రీ సరస్వతీ విద్యాలయ డిగ్రీ కళాశాల వికారాబాద్ బ్యాచ్ కి సంబంధించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. చాలా రోజుల తర్వాత కలుసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఒకరి గురించి ఒకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించి గౌరవించారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కనకదుర్గ, ఉపాధ్యాయులు చైతన్య దేవ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్, జూన్ 30: సత్యసాయి భజన మండలి కొడంగల్ ఆధ్వర్యంలో స్థానిక అక్షర ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌లోని నాసక్‌రామ్‌గుడా శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది ఆదివారం ఉచిత కంటి వైద్య శిరాన్ని నిర్వహించారు. మొత్తంగా 125 మంది కంటి పరీక్షలు నిర్వహించుకోగా అందులో 35 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు కంటి వైద్య నిపుణుడు ఎండీ. సహద్ తెలిపారు. వీరిని ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌లోని శంకర్ కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఉచితంగా మందులు, కంటి అద్దాలు సరఫరా చేయను న్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది బాలరాజు, విజయ్, ఉమారాణి, నందినిలతో పాటు శ్రీ సత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం...

పెద్దేముల్, జూన్ 30 :చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెద్దేముల్ మండల ఏఎస్ఐ నారాయణ సూచించారు.ఆదివారం మండల పరిధిలోని బుద్ధారం గ్రామ ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, మార్పు చేసిన నూతన వాహన చలాన్ల వివరాలు, వివిధ రకాల సైబర్ నేరాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, వాట్సాప్, ఓటీపీ లింకులకు సంబంధించి క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ మద్యం తాగి,హెల్మెట్ లేకుండా ఎవ్వరు కూడా వాహనాలను నడపరాదన్నారు. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే అనవసరమైన ఏపీకే లింకులను ఓపెన్ చేయడం కానీ,అప్లోడ్ చేయడం కానీ చేయరాదని అలాచేస్తే ఫోన్‌లు హ్యాక్ అయి అకౌంట్లలో డబ్బులు మాయమవుతాయన్నారు. ప్రజలు మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహనను పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ మున్నయ్య, సంతోష్, మురళీధర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ అందరివాడు: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, జూన్ 30: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బాటలు వేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబే ద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడిచి సమాజ ఉద్ధర ణకు కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవ సాయ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెకట రమణ, వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఎం వెంకటయ్య,మండల అధ్యక్షుడు హెచ్ సత్యయ్య, ఎంఈవో హరిశ్చందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట య్య, కడుమూరు ఆనందం, కర్రె భరత్‌కుమార్,సాలేటి వెంకట్, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

పెద్దేముల్, జూన్ 30 : సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను ట్రేస్ చేసి పట్టుకోవడం చాలా సులభమని పెద్దేముల్ మండల ఎస్ఐ కె.గిరి అన్నారు.ఆదివారం పెద్దేముల్ పోలీసు స్టేషన్‌లో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొన్న ఓ బాధితుడికి సెల్‌ఫోన్‌ను సిబ్బందితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు సాకేత్‌నగర్ సమీపంలో కొనసాగుతున్న సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ బోయిని నర్సింహులు జనవరి 29, 2024 నాడు ఎన్‌టీఆర్ కాలనీ నుంచి తాండూరుకు బైక్‌పై వెళుతుండగా తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకొన్నాడు.ఈ విషయమై మార్చి నెలలో పెద్దేముల్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును స్వీకరించిన ఎస్ఐ గిరి సీఈఐఆర్ అప్లికేషన్‌లో పోగొట్టుకు పోయిన సెల్‌ఫోన్ వివరాలను నమోదు చేసి ట్రేస్ చేసి ఫోన్ జాడను కనిపెట్టి ఆదివారం బాధితుడు నర్సింహులు సెల్‌ఫోన్‌ను అప్పగించారు.

నేడు ప్రజావాణి..

పరిగి, జూన్ 30: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పరిగి ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం జరు గుతుం దని, అన్ని శాఖల అధికారులు ఈ కార్య క్రమంలో పాల్గొంటారన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

బొంరాస్‌పేట: జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రజా వాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకన్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా వాణి లో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని ప్రజ లు తమ సమస్యలను అధికారుల దృష్టికి తేవాలని ఆయన కోరారు. ఇకనుంచి ప్రతి సోమవారం మం డల పరిషత్ కార్యాలయంలో ప్రజా వాణి నిర్వహి స్తామని, మండలస్థాయి అధి కా రులు అందరు ప్రజావాణిలో పాల్గొని ఉద యం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వర కు ప్రజల నుంచి విజ్ఞప్తులు తీసుకోవాలని వెంకన్‌గౌడ్ కోరారు.

ఎస్జీటీ ఖాళీలను బదిలీలకు చూపించాలి

బొంరాస్‌పేట, జూన్ 30 : ఎస్జీటీ తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయుల బదిలీలకు వేలాది పోస్టులను బ్లాక్‌చేసి అప్రకటిత రేషనలైజేషన్ చేయడాన్ని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్, నరేందర్ తీవ్రంగా ఖండించారు. రేషనలైజేషన్‌పై విధానపరమైన నిర్ణయం తీసుకోకుండా విద్యార్థుల సంఖ్య ననుసరించి పాఠశాలలకు అదనపు పోస్టులను మాత్రం కేటాయించడం లేదని వారు విమర్శించారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లో లేని హేతుబద్ధీకరణను మధ్యలో చొప్పించి కేవలం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రమే అమలు చేయడం గందరగోళానికి గురిచేస్తుందని వారు అన్నా రు. ఎస్జీటీలకు ఆప్షన్ ఇచ్చే గడువును ఒక్క రోజే ఇచ్చి హడావుడిగా ముగించాలని చూడడం సమంజసం కాదని అన్నారు.

సీనియారిటీ జాబితాల్లో తప్పులు సవరించకుండా, ఖాళీలను పూర్తిస్థాయిలో చూపించకుండా జరిపే బదిలీలు ఎవరి ప్రయోజనం కోసమని వారు ప్రశ్నించారు. పొరపాట్లను సవరించి పారదర్శకంగా వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని గోపాల్, నరేందర్ గౌడ్‌లు డిమాండ్ చేశారు